బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శుక్రవారం 03 జనవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా సావిత్రి బా పూలే జయంతి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
రాష్ట్రంలో సావిత్రి బాయి పూలే జయంతి (జనవరి 3) వేడుకలను ప్రభుత్వం జరుపునుంది. భారతదేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, మహిళా విముక్తికి వి ద్య ఒక్కటే మార్గమని మహిళల కోసం తొలి పాఠశాలను స్థాపించిన సంఘ సంస్కర్త సావిత్రి బాయి పూలే. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సావిత్రి బాయి పూలే జయంతి రోజుని "మహిళా ఉపాధ్యాయ దినోత్సవం"గా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది.

# త్వరలోనే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు

- మంత్రి పొన్నం ప్రభాకర్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
త్వరలోనే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా, ప్రతి గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగరాలనే సంకల్పంతో, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని ఆయన సూచించారు. గురువారం, సిద్ధిపేట జిల్లాలోని కోహెడ్ లో పర్యటించిన ఆయన, అక్కడ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. ఈ సమావేశంలో, లోకల్ బాడీ ఎలక్షన్ల కోసం ప్రస్తుతం నుంచే పార్టీ నాయకులు వ్యూహాత్మకంగా పనిచేయాలని, ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల మధ్య లోతుగా పంచుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని చిగురుమామిడి, సైదాపూర్, తదితర మండలాల్లో కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తూ ముందుకు సాగు తుందని అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సంక్రాంతికి రైతుభరోసా అందిస్తామని తెలిపారు. కేబినెట్ సబ్ కమిటీలో రైతుభరోసాపై నిర్ణయం తీసుకుంటామనిపేర్కొన్నారు.

రాబోయే ఎన్నికల్లో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అదే విధంగా ప్రజల వద్దకు వెళ్లి గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏమి చేసిందని ప్రశ్నించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని గుర్తు చేశారు. ఇప్పటికే 200 యూనిట్ల ఉచి త విద్యుత్, 500లకే గ్యాస్ సిలిండర్ ప్రభుత్వం అమలు చేయడంతో 90శాతం ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. త్వరలోనే కొత్త రేషన్ కార్డులతో పాటు ఇందిరమ్మ ఇళ్లను అందిస్తామని పేర్కొంటున్నారు. ఏడాది కాలంలోనే హుస్నాబాద్ నియోజకవర్గం గౌరవం పెరిగిందన్నారు. ఇప్పటికే 55వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. సన్న వడ్లకు 500బోనస్ ఇచ్చామని గుర్తు చేశారు.

అదే విధంగా రైతులకు ప్రభుత్వం 2లక్షల రుణమాఫీ చేసిందని, గురుకుల పాఠశాలలకు డైట్ చార్జీలు పెంచామని గుర్తు చేశారు. ఎన్నికల్లో పోటీ చేసే వారు గ్రామాల్లో కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో విద్య, వైద్యం, సాగునీరు అందించడమే ప్రధాన లక్ష్మన్నారు. సంక్రాంతికి రైతుభరోసా అందిస్తామని తెలిపారు. కేబినెట్ సబ్ కమిటీలో రైతుభరోసాపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ఇప్పటికే 30వేల కోట్ల వ్యవసాయం రైతు సంక్షేమం కోసం కేటాయించామన్నారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరు పని చేయాలని కార్యకర్తలకు, ముఖ్య నేతలకు, ప్రజా ప్రతినిధులకు సూచించారు. గెలుపే లక్షంగా ప్రతి కార్యకర్త సైనికుడిల్లా పని చేయాలని సూచించారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తూ ముందుకు సాగుతుందని అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రజా పాలన ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామ గ్రామాన ప్రజల్లోకి తీసుకెళ్లి సూచిస్తూ పార్టీ శ్రేణులతో సమావేశాలను నిర్వహిస్తున్నారన్నారు.

# సంక్రాంతికే రైతు భరోసా..

- తెలంగాణ రైతులకు ప్రభుత్వం గుడ్ న్యూస్
- ఈ నెలలోనే రైతుభరోసా నగదు
- జనవరి 5 నుంచి 7 వరకు దరఖాస్తులు స్వీకరణ
- జనవరి 14 నుంచి రైతు భరోసా అమలు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
తెలంగాణలోని రైతులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది.. రైతుభరోసా నగదును ఈ నెలలోనే ఇవ్వనున్నట్లు పేర్కొంది.రైతు భరోసా అమలు పై కేబినెట్ సబ్ కమిటీ గురువారం భేటీ అయింది.. కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు సమాచారం. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పంట పండించే ప్రతి రైతుకు రైతు భరోసా అందించాలనే ముఖ్య ఉద్దేశంతో క్యాబినెట్ సబ్ కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించిదన్నారు. ఈ మేరకు సబ్ కమిటీ రైతు భరోసా అమలు కోసం ప్రత్యేకంగా దరఖాస్తులు స్వీకరిం చింది.. రైతుల నుంచి జనవరి 5 నుంచి 7 వరకు దరఖాస్తులు స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ తర్వాత ఫీల్డ్ సర్వే, శాటిలైట్ మ్యాపింగ్ ఆధారంగా సాగు భూముల వివరాలు ధ్రువీకరించి, జనవరి 14 నుంచి రైతు భరోసా అమలు చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

సాగు చేసే భూములకే రైతుభరోసా ఇవ్వాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించగా.. సబ్ కమిటీ కూడా ఇదే నిర్ణయాన్ని వెలిబుచ్చినట్టు సమాచారం. అయితే.. సాగు భూములను శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా గుర్తించనున్నారు. ధరణి ప్రకారం కోటి 53 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్టు తెలుస్తుండగా.. అందులో నుంచి సాగు చేయని భూములు తీసేస్తే.. కోటి 30 లక్షల ఎకరాలకు రైతుభరోసా ఇవ్వాలని అధికారులు సూచించినట్టున్న తెలుస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం రైతు భరోసాపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క సీఎం రేవంత్ రెడ్డిని కలవనున్నారు. సబ్ కమిటీ తీసుకున్న నిర్ణయాలు, అమలుపై అన్ని రకాల అంశాలు వివరించనున్నారు. శనివారం నిర్వహించనున్న కేబినెట్‌లో రైతు భరోసా అమలుపై తుది నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది.


## ఆలయాల్లో విజయ నెయ్యే వాడాలి




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో తప్పనిసరిగా ప్రభుత్వరంగ సంస్థ అయిన విజయ నెయ్యిని మాత్రమే వాడాలని ప్రభుత్వం స్ప ష్టం చేసింది. యాదాద్రికి మాత్రం మార్చి వరకు మినహాయింపునిచ్చింది. తిరుమల లడ్డూ వివాదం అనంతరం రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో విజయ నెయ్యిని మాత్రమే వాడాలని దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీచేసిన విషయం విదితమే. ప్రభుత్వ ఉత్తర్వులను ఉ ల్లంఘించి ప్రైవేటు డెయిరీతో ఒప్పం దం చేసుకున్న భద్రాద్రి ఆలయ అధికారులపై చర్యలు తీసుకున్న ప్రభు త్వం.. ఇతర ఆలయాల్లో నెయ్యి సరఫరాపై సమీక్షించి నివేదిక ఇవ్వాలని కమిషనర్‌ను ఆదేశించింది. ఇతర డె యిరీలతో ఉన్న ఒప్పందాలను వెం టనే రద్దు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. యాదాద్రిలో స్థానిక ప్రజాప్రతినిధుల విన్నపం మేరకు మార్చి చివరి వరకు మదర్ డెయిరీ నెయ్యి సరఫరా కానుంది.


# చెరువుల ఎఫ్‌టీఎల్‌లను గుర్తించాలి

- నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత ప్రక్రియ ఏ దశలో ఉన్నదో చెప్పాలి
- ఎన్ని నిర్ధారించారు, ఇంకా ఎన్ని నిర్ధారించాలి
- నివేదిక ఇవ్వాలని సర్కారుకు హైకోర్టు ఆదేశం




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
హెచ్ఎండీఏ పరిధిలోని చెరువుల ఎఫ్‌టీఎల్‌లను గుర్తించాలని, ఆ మేరకు నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత ప్రక్రియ ఏ దశలో ఉన్నదో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. హెచ్ఎండీఏ పరిధిలోని రామమ్మ కుంటలో ఎఫ్‌టీఎల్ పరిధిలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ నిర్మాణాలు చేపట్టిందనే వ్యాజ్యంలో ఈ ఆదేశాలు జారీచేసింది. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టడంపై దాఖలైన పిల్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రీనివాస్‌రావుతో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం మళ్లీ విచారణ చేపట్టింది. అన్ని చెరువుల బఫర్ జోన్లు, ఎఫ్‌టీఎల్‌కు చెందిన అన్ని అంశాలపై సుమోటోగా విచారణ చేపడతామని ధర్మాసనం ప్రకటించింది ఈ నేపథ్యంలో హెచ్ఎండీఏ పరిధిలోని చెరువుల్లో ఎన్నింటికి ఎఫ్‌టీఎల్ నిర్ధారణ చేశారో, ఎన్నింటికి చేయాలో, నిర్ధారణ చేసేందుకు జారీచేసిన నోటిఫికేషన్ అమలు ప్రక్రియ ఏ దశలో ఉందో చెప్పాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది పీ శ్రీధర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ హెచ్ఎండీఏ పరిధిలో 3,342 చెరువులున్నాయని, వాటిలో 2,793 చెరువులకు ఎఫ్‌టీఎల్ గుర్తింపునకు ప్రాథమిక నోటిఫికేషన్ వెలువరించామని చెప్పారు. 708 చెరువులకు ఎఫ్‌టీఎల్ గుర్తిస్తూ తుది నోటిఫికేషన్ వెలువరించినట్టు వివరించారు. ఈ మేరకు హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశాక మరో 57 చెరువులకు తుది నోటిఫికేషన్ జారీచేసినట్టు చెప్పారు. మిగిలిన చెరువులకు ఎఫ్‌టీఎల్ నోటిఫికేషన్ జారీకి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. వివరాల నివేదనకు గడువు కావాలని కోరారు. ఇందుకు అనుమతిచ్చిన హైకోర్టు, తదుపరి విచారణను ఫిబ్రవరి 4వ తేదీకి వాయిదా వేసింది.

## ఈడీ విచారణకు
# బీఎల్ఎన్ రెడ్డి గైర్హాజరు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
ఫార్ములా ఈ రేస్ కేసులో ఈడి విచారణకు హెచ్ఎండిఏ రిటైర్డు చీఫ్ ఇంజనీర్ బిఎల్ఎన్ రెడ్డి గురువారం గైర్హాజర్ అయ్యారు. తనకు మరికొంత సమయం కావాలని ఈ నెల 8 వ తేదిన విచారణకు వస్తానని ఆయన ఈడికి మెయిల్ ద్వారా తెలియజేసారు. అలాగే శుక్రవారం ఈడి విచారణకు హాజరు కావాల్సిన ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ కూడా తాను ఈ నెల 9న హాజరు కానున్నట్టు ఈడీ అధికారులకు మెయిల్ పంపించారు. వీరి విజప్తికి ఈడి కూడా సానుకూలంగా స్పందించింది.

ఇదే కేసులో ఈడి నుంచి సమన్లు అందుకున్న ఎ1 నిందితుడు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ ఈ నెల 7న విచారణకు హాజరు కావాల్సి ఉండగా ఆయన హాజరు కూడా అనుమానమేనని అంటున్నారు.ఇదే కేసులో తనపై ఏసీబీ నమోదు చేసిన కేసు అక్రమమని కేటీఆర్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేయడంతో తీర్పును హైకోర్టు రిజర్వు చేసిన విషయం తెలిసిందే. ఈ తీర్పు తమకు అనుకూలంగా వస్తుందన్న నమ్మకంతోనే గురు, శుక్రవారాలలో ఈడి విచారణకు బిఎల్ఎన్ రెడ్డి , అర్విందకుమార్ గైరాహజర్ అయి ఉంటారనే ప్రచారం జరుగుతోంది.

ఈ రేసు కార్ ఉదంతంలో తనపై ఎసిబి నమోదు చేయడం, దాని ఆధారంగా ఈడి కూడా కేసు నమోదు చేయడాన్ని కెటిఆర్ హైకోర్టులో సవాల్ చేయగా, ఆయన తరపున హైకోర్టులో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ దవే వాదనలు వినిపించారు. ఈ వ్యవహారంలో అసలు అవినీతే జరగలేదన్నది కెటిఆర్ వాదన. ఈ రేస్ పై 14 నెలలు తర్వాత కేసు పెట్టారని, ఇది పూర్తిగా రాజకీయ కక్షగా ఆయన తరపు న్యాయవాది హైకోర్టులో వాదించగా, ప్రభుత్వం తరపున ఎజి సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తు దశలో ఉందని, ఈ సమయంలో అడ్డుకోవడం సరికాదని ఎజి హైకోర్టును కోరిన విషయం తెలిసిందే. ఇరు పక్షాల వాదనల తర్వాత క్వాష్ పిటిషన్ పై హైకోర్టు తీర్పును రిజర్వ్‌లో పెట్టడంతో పాటు తీర్పు వెల్లడించే వరకు కెటిఆర్‌ను అరెస్టు చేయొద్దని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో హైకోర్టు లో తమకు అనుకూలంగా తీర్పు వస్తుందన్న అంచనాతోనే ఈ కేసులో ఎ3 బిఎల్ఎన్ రెడ్డి, ఎ2 అర్వింద్‌కుమార్ ఈడి విచారణకు హాజరు కాకుండా గడువు కోరినట్టు అధికార వర్గాల సమాచారం. ఈ-కార్ రేసు పై ఎసిబి పెట్టిన కేసును హైకోర్టు కొట్టివేస్తే, అప్పుడు ఈడి పెట్టిన కేసు కూడా ఉండదని బిఎల్ఎన్ రెడ్డి, అర్వింద్‌కుమార్ ధీమాగా ఉన్నట్టు తెలిసింది.ఈ నేపథ్యంలో ఈ నెల 7వ తేదీన ఇడి విచారణకు కెటిఆర్ హాజరు కావడం కూడా అనుమానమేనని ఈవర్గాలు అంచనా వేస్తున్నాయి.


ఈ కార్ -రేస్ నిర్వహణకు ఫార్ములా ఈ ఆపరేషన్స్ అనే సంస్థకు నేరుగా రూ. 45.71 కోట్లను యుకె కరెన్సీని పౌండ్ల రూపంలో బదిలీ చేసిన వ్యవహారం పై ఇడి ఆరా తీస్తోంది. ఈ కారు రేస్ నిర్వహణ లో ఆర్థిక లావాదేవీలలో ఫెమా నిబంధనల ఉల్లంఘన జరిగినట్టు తాజాగా ఈడి తన దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ మేరకు నిధులను బదిలీ చేసిన హైదరాబాద్ హిమాయత్ నగర్ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌కు కూడా ఈడి నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. ఎవరి ఆదేశాలతో విదేశీ సంస్థకు నిధులు చెల్లించారనే కోణంలో ఈడి ఆరా తీస్తోన్నట్టు సమాచారం.



## తమిళనాడులో
# రూ. వెయ్యి కోట్ల సైబర్ మోసం..

- పశ్చిమ బెంగాల్‌లో ఈడీ తనిఖీలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
తమిళనాడులో సుమారు వెయ్యి కోట్ల సైబర్ మోసం జరిగింది. అయితే ఆ కేసుకు సంబంధించిన తనిఖీలు పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట అధికారులు బెంగాల్‌లోని 8 ప్రదేశాల్లో సోదాలు చేపట్టారు. కోల్‌కతాలో పార్క్ స్ట్రీట్, సాల్ట్ లేక్, బగుహతి ఏరియాల్లో తనిఖీలు జరిగాయి.మరో జిల్లాలోని మూడు ప్రదేశాల్లో సోదాలు చేపడుతున్నారు. సాల్ట్ లేక్ ఏరియాలో రిగిన తనిఖీల్లో.. ఈడీ అధికారులు ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. బగుహతి ఏరియాలో ఉన్న ఓ రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లో తనిఖీలు జరుగుతున్నట్లు ఈడీ అధికారి తెలిపారు. ఈశాన్య భారత్‌కు చెందిన పలు రాష్ట్రాల వ్యక్తులు ఈ క్రైంలో పాల్గొన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.



## ప్రశాంత్ కిషోర్ ఆమరణ నిరాహార దీక్ష

- బీహార్ సివిల్స్ సర్వీస్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
ఎన్నికల వ్యూహకర్త, జన్ సూరజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. బీహార్ సివిల్స్ సర్వీస్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న నిరుద్యోగులకు మద్దతుగా ఆయన గురువారం ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. బీహార్ ప్రభుత్వం ఇటీవల ఇంటిగ్రేటెడ్ కంబైన్డ్ కాంపిటేటివ్ (ప్రిలిమనరీ) ఎగ్జామినేషన్ 2024 ను బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించింది. అయితే ఈ పరీక్ష పేపర్ లీక్ అయిందంటూ నిరుద్యోగులు గత కొద్ది రోజులుగా ఆందోళన చేపట్టారు. వారి ఆందోళన వేదిక గార్డని బాగ్‌కు రెండు కిమీ దూరంలో ప్రశాంత్ కిషోర్ ఆందోళన వేదిక ఉండడం గమనార్హం. ఆదివారం రాత్రి నిరుద్యోగులపై పోలీస్‌లు లాఠీ ఛార్జి చేస్తున్న సమయంలో ప్రశాంత్ కిషోర్ అక్కడ నుంచి వెళ్లిపోవడం అభ్యర్థులకు ఆగ్రహం కలిగించిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల్లో రెండింట మూడొంతులు స్థానికులకే లభించేలా రిజర్వేషన్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

# హాస్టల్ బాత్‌రూమ్‌లో కెమెరాలు..!

- వీడియోలు తీస్తున్నారంటూ మేడ్చల్‌లో సీఎంఆర్ కాలేజీలో విద్యార్థినుల ఆందోళన
- మద్దతు తెలిపిన విద్యార్థి సంఘాలు
- ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు






**బలగం టీవి, మేడ్చల్**
మేడ్చల్ జిల్లా కండ్లకోయ సీఎంఆర్ ఐటీ మహిళా హాస్టల్‌లో బాత్రూంలోని దృశ్యాలను చిత్రీకరించారంటూ విద్యార్థినులు ధర్నాకు దిగారు. దీంతో స్థానిక ఏసీపీ, సీఐ ఈరోజు హాస్టల్‌కు చేరుకున్నారు. విద్యార్థినుల ఆరోపణల నేపథ్యంలో దర్యాప్తు చేస్తున్నారు. బాత్రూంలో ఉన్నప్పుడు వీడియోలు తీస్తున్నారని అమ్మాయిలు ఆరోపిస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత... గురువారం తెల్లవా రుజాము 2 గంటల వరకు విద్యార్థినులతో కలిసి విద్యార్థి సంఘాలు ఆందోళన చేశాయి. ఈ ఘటనపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని వారికి పోలీసులు హామీ ఇచ్చారు. దీంతో వారు తమ ఆందోళనను విరమించారు.

బుధవారం రాత్రి గర్ల్స్ హాస్టల్‌లోని బాత్‌రూంలో అమ్మాయిల వీడియోలను సెల్‌ఫోన్ తీశారని ఆరోపిస్తూ కాలేజిలోని విద్యార్థినులంతా ధర్నాకు దిగారు. హాస్టల్ బాత్‌రూముల్లో కెమెరాలు అమర్చి రహస్యంగా వీడియోలు తీస్తున్నారంటూ విద్యార్థినిలు ఆరోపిస్తున్నారు. అయితే హాస్టల్లో మెస్‌లో పనిచేసే అయిదుగురిపై విద్యార్థినీలు అనుమానం వ్యక్తం చేయగా వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

వివరాల్లోకెళ్తే.. గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో అమ్మాయిల కోసం ప్రత్యేక హాస్టల్ నిర్వహిస్తున్నారు. ఈ హాస్టల్‌లో ఉండే అమ్మాయిలు బాత్రూంలో ఉన్నప్పుడు తమ వీడియోలు తీస్తున్నారని ఆరోపిస్తూ బుధవారం రాత్రి నుంచి వసతి గృహం వద్ద ధర్నాకు దిగారు. బాత్‌రూం వెంటిలేటర్ వద్ద ఒకరి షాడో కనిపించిందని, అక్కడ వేలిముద్రలు కూడా పడ్డాయని విద్యార్థినీలు చెబుతున్నారు.విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థులతో కలిసి నిరసన చేపట్టారు. విద్యార్థుల ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి

మిగితా 2వ పేజీలో

## ట్రాఫిక్‌జామ్‌లో ఆసియాలోనే బెంగళూరు టాప్..



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
టామ్‌టామ్ ట్రాఫిక్ ఇండెక్స్ 2023 ప్రకారం.. ట్రాఫిక్ జామ్ పరంగా ఆసియాలోనే టాప్ 10 నగరాల జాబితాలో బెంగళూరు మొదటిస్థానంలో నిలిచింది. ఇక్కడ పీక్ అవర్స్‌లో కేవలం 10 కిలోమీటర్ల దూరానికే ఏకంగా 28 నిమిషాల 10 సెకన్ల సమయం పడుతుంది. అంటే ఈ టెక్‌హబ్‌లోని నివాసితులు ఏటా దాదాపు 132 గంటలపాటు ట్రాఫిక్ జామ్‌లోనే చిక్కుకుపోతారు. అందుకు కారణంగా బెంగళూరులో రద్దీకి తోడు నగరం వేగంగా విస్తరిస్తుండటమే. దక్షిణ, ఉత్తర భారతదేశంలోని చాలా రాష్ట్రాల ప్రజలు ఎక్కువగా బెంగళూరుకే వెళుతుంటారు. ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తూ అక్కడే నివసిస్తుంటారు. దీంతో పట్టణం కూడా బాగా విస్తరిస్తోంది. మరోవైపు ఈ సిలికాన్ సిటీలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు పాలకులు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం రావడం లేదు. నగర రోడ్లలో ప్రయాణం నరకయాతంగా మారిపోయింది. ఇక పీక్స్ అవర్స్, హాలిడేస్‌లో ట్రాఫిక్‌ను తప్పించుకోవడం పెద్ద టాస్క్‌గా మారింది.

ఇక ఈ జాబితాలో బెంగళూరు తర్వాత పూణె రెండో స్థానంలో నిలిచింది. ఇక్కడ 10 కిలోమీటర్ల దూరానికి 27 నిమిషాల 50 సెకన్ల సమయం పడుతోంది. ఆ తర్వాత ఫిలిప్పీన్స్‌లోని మనీలా (27 నిమిషాల 20 సెకన్లు) , తైవాన్‌లోని తైచుంగ్ (26 నిమిషాల 50 సెకన్లు), జపాన్‌లోని సప్పోరో (26 నిమిషాల 50 సెకన్లు), తైవాన్‌లోని కహోసియుంగ్ (26 నిమిషాలు), జపాన్‌లోని నగోయా (24 నిమిషాల 20 సెకన్లు),

మిగితా 2వ పేజీలో

# నితీశ్ కుమార్‌కు మా తలుపులు తెరిచే ఉన్నాయి

- మాజీ సీఎం లాలూప్రసాద్ యాదవ్
- రెండు చేతులు జోడించి దండం పెట్టిన నితీశ్ కుమార్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు మాజీ సీఎం, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ ఓ ఆఫర్ ఇచ్చారు. నితీశ్ కుమార్‌కు మా (ఇండియా కూటమి) తలుపులు తెరిచే ఉన్నాయని, ఆయన కూడా తన గేట్లు తెరవాలన్నారు. రెండు వైపుల తెరిస్తేనే ఇరువైపుల రాకపోకలు సులభతరమవుతాయని వ్యాఖ్యానించారు. తద్వారా ఆయనను ఇండియా కూటమిలోకి ఆహ్వానించారు.

లాలూ ప్రసాద్ చేసిన వ్యాఖ్యలపై మీడియా ప్రతినిధులు... నితీశ్ కుమార్‌ను ప్రశ్నించారు. మీరు కూటమిలోకి వస్తే స్వాగతిస్తామని లాలూ ప్రసాద్ యాదవ్ చెప్పారు కదా? అని మీడియా ప్రతినిధులు అడిగారు. దీనికి నితీశ్ కుమార్ తన రెండు చేతులను జోడించి దండం పెట్టి, ఓ చిరునవ్వు నవ్వారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తును అడ్డుకోలేం



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్రంలో సంచలనం స ృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణను అడ్డుకోలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే దర్యాప్తు సుదీర్ఘకాలం కొనసాగడం సరికాదని, దర్యాప్తు కొనసాగింపు పేరుతో పిటిషనర్‌కు ఉన్న స్వేచ్ఛను తాము అడ్డుకోలేమని వ్యాఖ్యానించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడిగా అభియోగాలు ఉన్న మేకల తిరుపతన్న(అప్పటి అడిషనల్ ఎస్పీ)కు బెయిల్ మంజూరు చేయాలని రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించగా తిరస్కరించింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ గతేడాది అక్టోబర్ 20న ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. సుదీర్ఘకాలంగా జైలులో ఉంటున్నానని, తనకు బెయిల్ మంజూరు చేయాలని పిటిషన్‌లో పొందుపరిచారు. గతంలో ఈ పిటిషన్ పై విచారణ చేపట్టిన సుప్రీం ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోపు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. మరోసారి ఈ పిటిషన్ జస్టిస్ బివి నాగరత్నం, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం ముందుకు వచ్చింది. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే, మోహిత్ రావు, రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కౌంటర్ పిటిషన్ దాఖలు చేసినట్టు ప్రభుత్వ తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసులో తిరుపతన్న ప్రధాన నిందితుడిగా ఉన్నారని వాదించారు. ఫోన్ ట్యాపింగ్‌తో పాటు ఆధారాలు చెరిపి వేయడంలోనూ తిరుపతన్న కీలకంగా వ్యవహరించారని, 2023 డిసెంబర్ 3న ఎన్నికల ఫలితాలు రాగానే ఆధారాలు ధ్వంసం చేశారని ధర్మాసనానికి లూథ్రా వివరించారు. అప్పుడు అధికారంలో ఉన్న రాజకీయ నేతల ఆదేశాల మేరకు అందరి ఫోన్లను ట్యాప్ చేశారని, హైకోర్టు జడ్జిల ఫోన్లు కూడా ఇందులో ఉన్నాయని అన్నారు. ఈ వాదనలపై పిటిషనర్ తరపు న్యాయవాది దుష్యంత్ దవే అభ్యంతరం తెలిపారు. తిరుపతన్న గత 9 నెలలుగా జైలులో ఉన్నారని, ఆయన పాత్రపై ఇప్పటికే చార్జ్‌షీట్ దాఖలైందని దవే ధర్మాసనానికి నివేదించారు. అయినప్పటికీ తిరుపతన్నను జైల్‌లో ఉంచడం సరికాదని, బెయిల్ పొందడం ఆయన హక్కు అని వాదించారు. తప్పనిసరైతేనే జైలులో ఉంచాలని సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులను ప్రస్తావించారు. ఈ సందర్భంగా ద్విసభ్య ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. 'ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తిరుపతన్న పాత్రపై దర్యాప్తు సుదీర్ఘకాలం కొనసాగడం సరికాదు. దర్యాప్తు పేరుతో పిటిషనర్ స్వేచ్ఛను అడ్డుకోలేరు. విచారణకు ఇంకా ఎంత సమయం పడుతుందో రాతపూర్వకంగా తమకు ఇవ్వండి' అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే తిరుపతన్న పాత్రపై ఇప్పటి వరకు చేసిన దర్యాప్తు సుప్రీంకోర్టుకు సమర్పించాలని స్పష్టం చేసింది. దీనిపై లూథ్రా స్పందిస్తూ... విచారణ పూర్తయ్యేందుకు మరో నాలుగు నెలల సమయం పడుతుందని, అఫిడవిట్ దాఖలుకు సమయం కావాలని కోరారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం తదుపరి విచారణను 27 కు వాయిదా వేస్తున్నట్టు వెల్లడించింది.

# ప్రభుత్వ తీరుపైన పోరాటం కొనసాగిద్దాం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కాంగ్రెస్ పార్టీ తుగ్లక్ విధానాలపైన, నిరంకుశ పాలనపైన, హామీలను ఎగవేసిన మోసపూరిత ప్రభుత్వ తీరుపైన మన పోరాటం కొనసాగిద్దామని బీఆర్ఎస్ శ్రేణులకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. కొత్త సంవత్సరం సందర్భంగా గురువారం పార్టీ శ్రేణులకు ఆయన ప్రత్యేక సందేశమిచ్చారు. ప్రాణ సమానులైనమన బీఆర్ఎస్ తోబుట్టువుల్లారా.. అంటూ ప్రారంభించిన కేటీఆర్, గత ఏడాది పాట చేసిన పోరాటాలను నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తూనే రానున్న రోజుల్లోనూ కాంగ్రెస్ మోసపూరిత ప్రభుత్వాన్ని గద్దెదించేదాకా పోరాటం సాగిద్దామని పిలుపునిచ్చారు. గత ఏడాది కాలంగా ఈ కాంగ్రెస్ నిరంకుశ పాలనపై గులాబీ సైనికులందరూ కనబరిచిన పోరాట స్ఫూర్తికి పేరుపేరునా ప్రతి ఒక్కరికి శిరస్సువంచి సలాం చేస్తున్నా. గెలుపు ఓటములతో నిమిత్తం లేకుండా.. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు కనబరిచిన కదనోత్సాహం.. రాష్ట్ర స్థాయిలో పని చేసే నాయకత్వంలో కూడా మాటలకందని స్థాయిలో కొండంత స్ఫూర్తి నింపిందని కేటీఆర్ పేర్కొన్నారు.తెలంగాణ గ్రామ గ్రామాన ఉన్న.. గులాబీ సైనికులు రాష్ట్ర ప్రజలపక్షాన.. విరామం ఎరుగని పోరాటం చేస్తున్నారనీ, అబద్ధాల పునాదులపై అధికారంలోకి వచ్చిన ఈ తుగ్లక్ పాలన వల్ల కష్టకాలంలో ఉన్న అన్ని వర్గాల పక్షాన అలుపులేని పోరాటం చేశారని అభినందించారు. ఏడాది కాలంలో పార్టీ శ్రేణులు రైతుల పక్షాన మీరు పోరాడారు, నేతన్నల గొంతుకై మీరు నిలిచారు, మహిళా సమస్యలపై మీరు గర్జించారు, బడుగు బలహీనవర్గాల ప్రజల గళమయ్యారు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల పక్షాన సమరభేరి మోగించారు.. నిరుద్యోగుల హక్కుల కోసం కాంగ్రెస్ సర్కారును నిలదీశారు.. ఎన్నికల్లో ఇచ్చిన గ్యారెంటీల గారడీని ప్రజాక్షేత్రంలో ఎండగట్టారని కేటీఆర్ తెలిపారు.

'మూసీలో మూటల వేట' నుంచి 'లగచర్ల లడాయి' వరకూ.. అన్యాయం జరిగిన ప్రతిచోటా బాధితుల పక్షాన మీరు కొట్లాడారనీ, తెలంగాణ ప్రజల గుండెచప్పుడును అడుగుడుగునా మీరు ప్రతిధ్వనింపజేశారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు పార్టీ చేసిన పోరాటాలు.. చరిత్రపై చెరగని సంతకాలుగా నిలుస్తాయన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను, అత్యంత సమర్థంగా తిప్పికొట్టిన సందర్భాలు.. ఈ పోరాటపథంలో నిలిచి ఉండే



మైలురాళ్లు మారాయి అని అన్నారు. తెలంగాణ ప్రజల కోసం గల్లీ నుంచి ఢిల్లీ దాకా.. అసమర్థ, అనాలోచిత కాంగ్రెస్ విధానాలపై.. బీఆర్ఎస్ శ్రేణులు మోగించిన జంగ్ సైరన్ ముఖ్యమంత్రికి ముచ్చెమటలు పట్టించిందని కేటీఆర్ పేర్కొన్నారు.

భారత రాష్ట్ర సమితి చేసిన అలుపెరగని పోరాటాల వల్లే.. అదానీ ఆశజూపిన రూ.100 కోట్లను ప్రభుత్వం వెనక్కి ఇవ్వాల్సి వచ్చిందన్న కేటీఆర్, లగచర్ల లడాయి.. యావత్ దేశం ముందు నియంతృత్వ కాంగ్రెస్‌ను దోషిగా నిలబెట్టిందన్నారు. ఏడాదికాలంగా ప్రభుత్వాన్ని నిలదీసే క్రమంలో నియంతృత్వ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో అక్రమ కేసులు పెట్టినా.. ప్రభుత్వం ఎంత వేధించాలని చూసినా.. మొక్కవోని ధైర్యంతో పార్టీ శ్రేణులు నిలబడ్డ తీరు అపూర్వం, అసాధారణం, చారిత్రాత్మకం అని కేటీఆర్ ప్రశంసించారు.

దశాబ్దాలపాటు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను, కుక్కలు చింపిన విస్తరిలా మార్చే కాంగ్రెస్ కుట్రలను, అడుగడుగునా ప్రశ్నిద్దాం, నిలదీద్దామని పిలుపునిచ్చారు. మన పార్టీకి పునాది రాళ్లు, మన బీఆర్ఎస్‌కు మూలస్తంభాలు పార్టీ శ్రేణులు అని, మన గులాబీ జెండాకు.. వెన్నుముక మీరే అన్నారు. పార్టీ తరపున నిలబడి.. కలబడే.. నేటి అలుపెరగని పోరాట యోధులే.. రేపటి తెలంగాణ రాజకీయ ముఖచిత్రంపై బీఆర్ఎస్ పక్షాన మెరిసే.. వజ్రాయుధాలుగా మారుతారని ఆకాంక్షించారు. ఏడాది పాటు అద్భుతమైన పోరాట పటిమ చూపిన గులాబీ సైనికులందరికీ గుండెల నిండా మరోసారి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు.

# ఏపీలో మరోసారి భూప్రకంపనలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాలో మరోసారి భూ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. రేపాయి, ముండ్లమూరు మండలంలోని గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం సెకన్లపాటు భూమి కంపించింది. దీంతో భయాందోళనకు గురైన స్థానికులు ఇండ్ల నుంచి బయటికి పరుగులు తీశారు. గత నెల 21, 22 తేదీల్లో ముండ్లమూరు మండలంలోని శింగన్నపాలెం, వేంపాటు, పెద్దఉల్లగల్లు, పసుపుగల్లు గ్రామాల్లో భూమి కంపించిన విషయం తెలిసిందే. గురువారం కూడా ఇదే మండలంలోని పలు గ్రామాల్లో భూ ప్రకంపనలు గ్రామస్థులను ఆందోళనకు గురిచేశాయి.

# రాష్ట్రంలో వేల కోట్ల కుంభకోణాలు

- **బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలో వేల కోట్ల రూపాయల అవినీతి చోటుచేసుకున్నదనీ, దాంట్లో మంత్రుల హస్తాన్ని ఆధారాలతో సహా చూపిస్తానని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. రెండు రోజుల్లో ప్రభుత్వ అవినీతిని బయటపెడుతానని ప్రకటించారు. ఏడాది కాలంలో రూ.1,38,117 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం అప్పుగా తెచ్చిందనీ, అందులో రుణమాఫీకి కేటాయించింది రూ.20 వేల కోట్లు మాత్రమేననీ, మిగతా 1,18,000 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు. గుత్తేదారులకు లబ్ది చేకూర్చేందుకు పేదలను ఇబ్బందులకు గురిచేస్తారా? అని అడిగారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రోజు రూ.354 కోట్లు, గంటకు రూ.14.70 కోట్ల అప్పు చేస్తున్నదని వివరించారు. ఎఫ్ఆర్‌బీఎమ్ పరిధి దాటి అప్పులు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు. రూ.30 వేల కోట్ల కోసం 400 ఎకరాల భూమిని అప్పు తనఖా పెట్టిందని విమర్శించారు. మరో రూ. 30 వేల కోట్ల కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నదనీ, బాండ్ల రూపంలో మరో రూ.30 వేల కోట్ల అప్పులు తేవాలని చూస్తోందని వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం 80 లక్షల దరఖాస్తులు అందాయనీ, వాటికి సంబంధించి విధివిధానాలు ఏమైనా రూపొందించారా? అని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంక్రాంతి వరకు 4 లక్షల మందికి ఇండ్లు ఇస్తామనటం ఎంత వరకు సాధ్యమని నిలదీశారు. రుణమాఫీ కాని రైతులకు మాఫీ చేయడంపై క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకోవాలని కోరారు. రైతు భరోసాకు సంబంధించి మూడు రోజులపాటు దరఖాస్తులు తీసుకుంటామని కాంగ్రెస్ చెప్పడం మోసం చేయడమేనని విమర్శించారు. రబీసీజన్‌లోనైనా రైతు భరోసా ఇస్తారా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతు కూలీలకు రూ.12 వేలు ఇస్తామని ఎందుకివ్వడం లేదని అడిగారు. రైతు భరోసాపై కమిటీ ఏర్పాటు చేసి 15 రోజుల్లో నివేదిక ఇస్తామన్నారనీ, కమిటీ వేసి ఐదు నెలలు దాటినా ఉలుకూపలుకూ లేదని విమర్శించారు. క్యాబినెట్‌లో రైతు భరోసాపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. కౌలు రైతులకు రూ.12 వేలు ఇవ్వకుండా ఎగ్గొట్టాలనే ఆలోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని విమర్శించారు. రాష్ట్రంలోని కౌలు రైతులను గుర్తించి వారికి ప్రభుత్వం ఐడీ కార్డులివ్వాలని డిమాండ్ చేశారు.

# టెట్ పరీక్షలు ప్రారంభం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాతపరీక్షలు గురువారం నుంచి ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, టెట్ చైర్మెన్ ఈవి నరసింహారెడ్డి తెలిపారు. గురువారం ఉదయం మొదటి విడత సోషల్ స్టడీస్ తెలుగు మాధ్యమం పేపర్–2ను 49 కేంద్రాల్లో 12,815 మంది దరఖాస్తు చేయగా, 9,259 (72.25 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. 3,556 (27.75 శాతం) మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం రెండో విడత సోషల్ స్టడీస్ తెలుగు మాధ్యమం పేపర్–2ను 52 కేంద్రాల్లో 12,734 మంది దరఖాస్తు చేస్తే, 9,637 (75.68 శాతం) మంది అభ్యర్థులు పరీక్ష రాశారని వివరించారు. 3,097 (24.32 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఈనెల 20 వరకు ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానం (సీబీఆర్టీ)లో టెట్ రాతపరీక్షలు జరుగుతాయి.

# శివలింగంపై పాము..

**బలగం టీవి, హైదరాబాద్**

నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం మల్లాపూర్ శివాలయం గర్భగుడిలోకి గురువారం పాము వచ్చింది. శివలింగంపై తిరుగుతున్న దృశ్యాలను అక్కడున్న భక్తులు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. ఈ వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది.



# నేడు చేపల విక్రయ సంచార వాహనాలు ప్రారంభం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా చేపల విక్రయ సంచార వాహనాలను శుక్రవారం ప్రజాభవన్ వేదికగా ప్రారంభించనున్నారు. సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి పథకం కింద మహిళా సంఘాల సభ్యులకు ఆమె వీటిని అందజేయనున్నారు. తొలివిడతలో 25 వాహనాలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే చేపల విక్రయంలో ఉన్న, ఆసక్తి గల స్వయం సహాయక బృందాలను ఆయా జిల్లాల మత్స్య అధికారులు, డీఆర్‌డీఓలు, కలెక్టర్లు ఎంపిక చేశారు. పచ్చి చేపలతో పాటు చేపల వంటకాలను విక్రయించేలా చేపల విక్రయ సంచార వాహనాలను తయారు చేశారు. వాహనాల్లో చేపలు, వంటకాలు తయారీ చేసి మార్కెట్లు, రద్దీ ప్రాంతాల్లో విక్రయించే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించనున్నది. మొదటి దశలో జిల్లాకు ఒక వాహనం చొప్పున 32 వాహనాలు మంజూరు చేశారు. అందులో శుక్రవారం 25 వాహనాలను మంత్రి సీతక్క ప్రారంభించ నున్నారు. ఒక్కోవాహనం ఖరీదు రూ.10 లక్షలు. ఫ్యాబ్రికేషన్‌తో కలిపితే రూ.10.38 లక్షలు. ప్రధానమంత్రి మత్స్య సమృద్ధి యోజన పథకంతో అనుసంధానం చేసిన ఈ పథకం ద్వారా లబ్దిదారులకు 60 శాతం సబ్సిడీ లభించనున్నది. మిగిలిన మొత్తాన్ని బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాల రూపంలో సెర్ప్ సమకూర్చనున్నది. మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక పురోగాభివృద్ధికి మొబైల్ ఫిష్ రిటైయిల్ అవుట్ లెట్స్ దోహదపడనున్నాయి.

స్త్రీ,శిశుసంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) శుక్రవారం హైదరాబాద్‌లోని వెంగళరావునగర్‌లో గల మహిళా శిశు సంక్షేమ కమిషనరేట్‌లో జిల్లా సంక్షేమ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.అంగన్వాడీ కేంద్రాల పరిస్థితి, నూతన భవనాల నిర్మాణం, చిన్నారుల సంరక్షణ, విద్య, అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫాం పంపిణీ, అంగన్వాడీ కేంద్రాల్లో ఫర్నీచర్ సరఫరా, లబ్దిదారుల హాజరు, టేక్ హోం రేషన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిన్నారుల ఎదుగుదల పర్యవేక్షణ, సరుకులు, వస్తువుల సరఫరా, మిషన్ శక్తి, మిషన్ వాత్సల్య తదితర అంశాలపై చర్చించే అవకాశముంది.

## పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య..

**బలగం టీవీ ,గంభీరావుపేట**



పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గంభీరావుపేట పేట మండలం మల్లారెడ్డిపేట గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన చింతకింది శివ కిషోర్ (16) పదో తరగతి చదువుతున్నాడు. ఓ అమ్మాయి తో శివ కిషోర్ మాట్లాడుతున్నాడని అంబటి హరిబాబు, కందుకల నవీన్, గెరిగంటి రాకేష్, కాసారం ప్రవీణ్ సోమరపు నివాస్ లు అతన్ని పిలిచి అమ్మాయితో మాట్లాడవద్దని చెప్పారు. శివ కిషోర్ ఆమె తన క్లాస్ మెట్ అని చెప్పిన వినకుండా కొట్టారు. ఇట్టి విషయాన్ని శివ కిషోర్ తన తల్లికి చెప్పాడు.అమ్మాయి తల్లి కూడా శివ కిషోర్ ను, శివ కిషోర్ తల్లి సునిత పిలిపించి ఇష్టం వచ్చినట్లు తిట్టింది. అట్టి అవమానం భరించలేక శివ కిషోర్ ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లి చింతకింది సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

## 17వ పోలీస్ బెటాలియన్‌లో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు..

**బలగం టీవీ , సిరిసిల్ల**

17వ పోలీస్ బెటాలియన్ లో ఘనంగా నూతన సంవత్సర వేడుకలను రాజన్న సిరిసిల్ల జిల్లా అర్బన్ పరిధి సర్దాపూర్ లో ని 17వ పోలీస్ బెటాలియన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిలు గా బెటాలియన్ కమాండెంట్ టి. గంగారాం, అసిస్టెంట్ కమాండెంట్ సాంబశివరావు లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేకు కట్టింగ్ చేసి బెటాలియన్ అధికారులకు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంధర్భంగా బెటాలియన్ కమాండెంట్ టి. గంగారాం మాట్లాడుతూ పోయిన సంవత్సర విషయాలను మరియు జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కొత్త సంత్సరంలో అందరికీ మంచిగా వుండాలని అలాగే ఎటువంటి మోసాలకు మోసపోవద్దు అని చెడు వ్యసనాలకు బానిస అవ్వకుండా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ సాంబశివరావు , అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



### డ్రైవింగ్ వచ్చిన ప్రతి ఒక్కరూ

## డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి...

- **ఎస్పీ అఖిల్ మహాజన్**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 18 సంవత్సరాలు నిండి డ్రైవింగ్ వచ్చిన ప్రతి ఒక్కరికి లైసెన్స్ ఉండాలనే ఉద్దేశ్యంతో జిల్లాలోని యువతి యువకులకు జిల్లా పోలీస్ శాఖ,రోడ్ రవాణా శాఖ ఆధ్వర్యంలో రెండవ దశ లైసెన్స్ మెళ నిర్వహించగా, ఉత్తీర్ణత సాధించిన వారికి లర్నింగ్ లైసెన్స్ లు జారీ చేసి నెల రోజుల వ్యవధిలో డ్రైవింగ్ టెస్ట్ నిర్వహించి డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేయడం జరుగుతుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు .గురువారం ఆర్టీవో కార్యాలయంలో వివిధ పోలీస్ స్టేషన్ల నుండి వచ్చిన 30 మందికి లైసెన్స్ టెస్ట్ లు నిర్వహించి లర్నింగ్ లైసెన్స్ లు ఎస్పీ అఖిల్ మహాజన్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ....ఈరోజుల్లో ద్విచక్ర వాహనం లేని ఇల్లు లేదని,వాహనం ఉన్నా చాలా మంది డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానే వాహనాలతో రోడ్లపైకి వస్తున్నారని,లైసెన్స్ లేకుండా వాహనం నడిపేవారికి రోడ్డు భద్రతపై అవగాహన సరిగా లేకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారని,అదేవిధంగా లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపి ప్రమాదాల భారిన పడినప్పుడు వారికి వచ్చే వారికి వచ్చే ప్రమాద భీమా వర్తించదని అని అన్నారు.

జిల్లాలో డ్రైవింగ్ వచ్చిన వారికి లైసెన్స్ ఉండాలనే ఉద్దేశ్యంతో యువతి యువకులకు జిల్లా పోలీస్ శాఖ మరియు జిల్లా రోడ్ రవాణా శాఖ ఆధ్వర్యంలో లైసెన్స్ మెళ నిర్వహించగా 700 దరఖాస్తులు రావడం జరిగిందని,వారికి డ్రైవింగ్ లైసెన్స్ ఆన్లైన్ టెస్ట్ కి సబధించిన పరీక్ష పై అవగాహన కల్పించి, వారితో నిర్ణిత రుసుముతో ఆన్లైన్ లో స్లాట్ బుక్ చేపించి ఆర్టీవో కార్యాలయంలో వివిధ పోలీస్ స్టేషన్ల నుండి వచ్చిన 30 మందికి డ్రైవింగ్ లైసెన్స్ కి ఆన్లైన్ లర్నింగ్ టెస్ట్ సంబంధించిన పరీక్ష నిర్వహించిన మనీ అన్నారు. ఉత్తీర్ణత పొందిన వారికి లర్నింగ్ లైసెన్స్ కు అందజేయడం జరిగిందని,మిగతా వారికి విడుతాల వారిగా పిలవడం జరుగుతుందని, అనంతరం వీరికి డ్రైవింగ్ టెస్ట్ నిర్వహించి ఉత్తీర్ణత అయిన వారికి డ్రైవింగ్ లైసెన్స్ లు అందజేయడం జరుగుతున్నరు.

### వాహనదారులకు విజ్ఞప్తి..

మద్యం సేవించి డ్రంక్ అండ్ డ్రైవ్ లో మూడు సార్లు ,లేదా అంతకన్నా ఎక్కవ సార్లు పట్టుబడితే వారి లైసెన్స్ రద్దు కోసం సంబంధిత రవాణా శాఖ అధికారులకు సిపార్సు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిఐ లు కృష్ణ, శ్రీనివాస్,డిటిఓ లక్ష్మణ్, వంశిధర్, రజిని దేవి, సిబ్బంది పాల్గొన్నారు.

# పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారానికి పటిష్ట చర్యలు..

- **పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు అందించేలా గురుకులాల నిర్వహణ..**
- **పాఠశాలల్లో స్టోర్ రూమ్, కిచెన్ రూమ్ వద్ద పరిశుభ్రత పై అధిక శ్రద్ధ**
- **కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు అందించేలా జిల్లాలోని గురుకులాలు , సంక్షేమ హాస్టల్స్ కేజీబీవీలను నిర్వహించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టల్స్ పర్యవేక్షణ పై కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్,తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టల్స్, కేజీబీవీ లలో విద్యార్థుల సంఖ్య, ఎంత మంది వంట మనుషులు ఉన్నారు, రోజు ఎంత మంది విధులకు హాజరు అవుతున్నారు, పారిశుద్ధ్య సిబ్బంది, పిల్లల ఆరోగ్య సంరక్షణకు చేపడుతున్న చర్యలు, నాణ్యమైన భోజనం , త్రాగు నీటి సరఫరా, తదితర వివిధ అంశాల పై చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టల్స్, ఏకలవ్య మోడల్ స్కూల్స్, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఇక నుంచి జిల్లా యంత్రాంగం పర్యవేక్షించడం జరుగుతుందని అన్నారు.జిల్లాలోని ప్రతి కేజీబీవి నిర్వహణలో ఆయా మండలాల ప్రత్యేక అధికారులు, తహసిల్దారులు, ఎం.పి.డి.ఓ.లు పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాలోని బాలికా రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవి లలో మహిళా సిబ్బంది మాత్రమే విధులు నిర్వహించేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. రానున్న 15 రోజులలో రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రభుత్వ హాస్టల్స్ లో చదివే విద్యార్థులకు హెల్త్ చెక్ అప్ నిర్వహణకు షెడ్యూల్ తయారు చేయాలని, ప్రతి నెల విద్యార్థులకు చెక్ అప్ జరగాలని అధికారులను ఆదేశించారు.

హాస్టల్స్ లో పిల్లలకు అవసరమైన కనీస సదుపాయాల కల్పన చర్యలు చేపట్టాలని, డార్మంటరీలో పిల్లల సంఖ్య అనుగుణంగా అవసరమైన మంచాలు, దుప్పట్లు అందుబాటులో ఉండేలా చూడాలని, పిల్లలకు డైనింగ్ ఏర్పాట్లు, హాస్టల్స్ పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలని అన్నారు. పిల్లల అకాడమిక్ సంబంధించి గణితం, సైన్స్, ఆంగ్ల భాష పై అధికంగా శ్రద్ధ పెట్టాలని అన్నారు. కేజీబీవి లోని విద్యార్థులకు ఈ సబ్జెక్టు ఆన్ లైన్ ద్వారా కోచింగ్ అందిస్తున్నామని, మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ సంతాప దినాలు ముగిసిన తర్వాత ఈ కోచింగ్ సౌకర్యాన్ని మిగిలిన రెసిడెన్షియల్ పాఠశాలలకు విస్తరించడం జరుగుతుందని,రెసిడెన్షియల్ పాఠశాలల్లోని స్టోర్ రూమ్, క్లీనింగ్ ఏరియా , వంట గది పరిసరాలు సంపూర్ణ పరిశుభ్రంగా ఉండాలని అన్నారు.

గురుకులాలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీ లను పారిశుద్ధ్య పర్యవేక్షణకు ఫార్మాట్ తయారు చేయాలని కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారికి సూచించారు.పిల్లలకు అందించే ఆహార నాణ్యత అంశంలో రాజీ పడడానికి వీలు లేదని, ఒక సారి వినియోగించిన నూనె మరొక సారి వాడ వద్దని అన్నారు.ఉపాధ్యాయులు కొరత ఎక్కడ ఉన్నా వెంటనే తెలియజేయాలని, పిల్లలు విద్యలో ఎక్కడ వెనుక పడవద్దని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కామన్ డైట్ ప్రకారం సరుకులు సరఫరా చేయని పక్షంలో కాంట్రాక్టర్ ను చేంజ్ చేయాలని అన్నారు. గురుకులాల నిర్వహణ సంబంధించి ఎదురయ్యే చిన్న చిన్న సమస్యలను ఎప్పటి కప్పుడు మండల స్థాయిలో పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో వేములవాడ రెవెన్యూ డివిజన్ అధికారి రాజేశ్వర్,జిల్లా విద్యాశాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి, ఎస్.డి.సి. రాదాబాయి, మండల ప్రత్యేక అధికారులు ఆర్ సి ఓ లు ప్రిన్సిపల్ లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేను కోరుకున్న చదువు పుస్తకాల్లో లేదు

- **ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**

**బలగం టీవీ , హైదరాబాద్**



తాను కోరుకున్న చదువు పుస్తకాల్లో కానీ... క్లాస్‌రూంలో కానీ లేదని, అందుకే ఇంటర్‌తో చదువు ఆపేశానని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 35వ బుక్ ఫెస్టివల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చెరుకూరి రామోజీరావు సాహిత్య వేదికపై ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. పుస్తకాలు ఉంటే ఇక ఉపాధ్యాయుల అవసరం కూడా ఉండదనిపిస్తుందని వ్యాఖ్యానించారు. ఇంటర్‌తోనే చదువు ఆపేశానని... కానీ పుస్తకాలను చదవడం మాత్రం ఆపలేదని డిప్యూటీ సీఎం తెలిపారు. తాను చదువుకోలేకనో లేక మార్కులు తెచ్చుకోలేకనో చదువు ఆపలేదన్నారు. బాగా చదివేవాడినని.. కానీ తాను కోరుకున్న చదువు పుస్తకాల్లో లేదన్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్ కూడా స్కూల్‌కు వెళ్లకుండానే ఇంటివద్ద నేర్చుకున్నాడని పుస్తకాల్లో చదివినట్లు చెప్పారు. ఆయన ప్రేరణతో అదే బాటలో ముందుకు సాగానన్నారు తనకు తన తల్లిదండ్రుల వల్ల పుస్తక పఠనం అలవాటైందన్నారు. తాను ఎక్కడైనా కోటి రూపాయలు ఇచ్చేందుకు ఆలోచించను కానీ... పుస్తకం ఇవ్వాలంటే మాత్రం ఆలోచిస్తానన్నారు. ఎవరికైనా నా పుస్తకం ఇవ్వాలంటే సంపద మొత్తం ఇచ్చినట్లుగా ఉంటుందన్నారు. ఎవరైనా పుస్తకాలు అడిగితే కొనిస్తాను తప్ప తన వద్ద ఉన్న పుస్తకాలను మాత్రం ఇవ్వనని తెలిపారు. తనకు పుస్తక పఠనం అలవాటే లేకుంటే ఏమయ్యేవాడినో అన్నారు.

## టీజీ సెట్ సర్టిఫికెట్ల జారీ ప్రారంభం

**బలగం టీవీ , హైదరాబాద్**

తెలంగాణ స్టేట్ - స్టేట్‌లెవెల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీజీ సెట్) సర్టిఫికెట్ల జారీని అధికారులు గురువారం ప్రారంభించారు. గతేడాది మేలో విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం సెప్టెంబర్ 10వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షా ఫలితాలను నవంబర్ 16న విడుదల చేశారు. ధృవపత్రాల పరిశీలన పూర్తైన అనంతరం సర్టిఫికెట్ల జారీని మొదలుపెట్టారు. ఓయూ పరిపాలనా భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్, సెట్ మెంబర్ సెక్రెటరీ, ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్‌కుమార్ నాయక్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను జారీ చేశారు. అర్హత సాధించిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను సెట్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఒరిజినల్ అక్‌నాలెడ్జ్‌మెంట్ స్లిప్‌తో వచ్చి తీసుకోవచ్చని పేర్కొన్నారు.

## గాజాపై ఇజ్రాయెల్ దాడుల్లో 18 మంది మృతి

**బలగం టీవీ , హైదరాబాద్**

గాజా స్ట్రిప్‌పై గురువారం ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు, హమాస్ నేతృత్వం లోని ఇద్దరు పోలీస్ ఉన్నతాధికారులు ఉన్నారు. మృతులు స్థానికంగా కాన్వాయ్‌ల నుంచి నిర్వాసితులకు సహాయం అందించే సభ్యులని అల్ ఆక్సా మార్టైర్స్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

## ఆటో బోల్తా పడి ఒకరు మృతి..

**బలగం టీవీ , హైదరాబాద్**

రంగారెడ్డి జిల్లా జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. లాల్‌పహాడ్ నుంచి చౌదర్‌గూడ మండలం వెళ్తున్న ఆటో తుమ్మలపల్లి గేటు వద్ద ఒక్కసారిగా బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తుమ్మలపల్లి గ్రామానికి చెందిన జంగయ్య అనే వ్యక్తిపై ఆటో పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న తొమ్మిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారందరిని చికిత్స నిమిత్తం స్థానికులు షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# డబ్ల్యూటీసీ ఫైనల్ ఆశలు నిలిచేనా..?



- నేటి నుంచి ఐదో టెస్టు
- గెలిస్తేనే డబ్ల్యూటీసీ ఫైనల్‌కు అవకాశం
- కెప్టెన్ రోహిత్ తుది జట్టు నుంచి తప్పుకోవచ్చంటూ కథనాలు
- చివరి టెస్టులో బుమ్రా చేతికి కెప్టెన్సీ !

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

బోర్డర్ – గవాస్కర్ ట్రోఫీలో భాగంగా శుక్రవారం నుంచి సిడ్నీ వేదికగా చివరి టెస్టు జరుగనున్నది. ఇప్పటికే సిరీస్‌లో 2–1 ఆధిక్యంలో ఉన్న ఆస్ట్రేలియా ఎలాగైనా ఈ టెస్టును సైతం గెలిచి ట్రోఫీని కైవసం చేసుకోవాలనుకుంటుంది. ఇక టీమిండియా సిడ్నీలో ఆస్ట్రేలియాను ఓడించి సిరీస్‌ను సమం చేసి పరువు కాపాడుకోవాలని ప్రయత్నంలో ఉన్నది. అలాగే భారత్ డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరేందుకు ఇది చివరి ఛాన్స్. ఈ మ్యాచ్‌లో ఓడితే ఇక ఫైనల్‌కు దారులు మూసుకుపోయినట్టే . ఒక వేళ గెలిచినా ఆస్ట్రేలియా, శ్రీలంక మధ్య జరిగే రెండు మ్యాచుల టెస్ట్ సిరీస్ ఫలితంపై భారత్ ఆధారపడాలి.

### రోహిత్‌ను తప్పిస్తారా..?

చివరి టెస్టులో భారత జట్టు పలు కీలక మార్పులు చేసే అవకాశం ఉన్నట్లుగా ప్రచారం జరుగుతుంది. ముఖ్యంగా గత కొంతకాలంగా ఫామ్ లేమితో విమర్శలు ఎదుర్కొంటున్న కెప్టెన్ రోహిత్ శర్మకు ఈ మ్యాచ్‌లో తప్పించనున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇది ప్రస్తుం చర్చనీయాంశంగా మారింది. రోహిత్ గతకొంతకాలంగా పరుగులు సాధించడంలో విఫలమవుతూ వస్తున్నాడు. ఈ క్రమంలో చివరి టెస్టులో చోటు దక్కుతుందా? పక్కన పెడుతారా? అన్న చర్చ సాగుతుంది. సిడ్నీ టెస్టుకు ముందు విలేకరుల సమావేశంలో పాల్గొన్న హెడ్ కోచ్ గంభీర్‌ను ప్లేయింగ్–11లో రోహిత్ పేరు ఉంటుందా? అని ప్రశ్నించగా.. క్లారిటీ ఇవ్వలేదు. తుది జట్టును మ్యాచ్‌కు ముందు పిచ్‌ను పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని చెప్పాడు. ప్రెస్‌మీట్ అనంతరం గంభీర్ సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌కు చేరుకొని ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నాడు. ప్రాక్టీస్ సమయంలో రోహిత్ స్లిప్‌లో లేకపోవడం గమనార్హం తొలి స్లిప్‌లో కోహ్లీ, రెండో స్లిప్‌లో కేఎల్ రాహుల్, మూడో స్లిప్‌లో నితీశ్ రెడ్డి ఉన్నారు. ఇక పంత్ వికెట్ కీపింగ్ చేయగా.. యశస్వీ జైస్వాల్ గల్లీలో ఫీల్డింగ్ చేస్తూ కనిపించాడు.

టీమిండియా రోహిత్‌ను పక్కనపెట్టాలని నిర్ణయిస్తే.. శుభ్‌మన్ గిల్‌కు తుదిజట్టులో చోటు దక్కే అవకాశాలు ఉన్నాయి. దాంతో కేఎల్ రాహుల్‌తో కలిసి జైస్వాల్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించేందుకు అవకాశం ఉంది. నాలుగో టెస్టులో బెంచ్‌కే పరిమితమైన గిల్.. సిడ్నీ టెస్టు సందర్భంగా బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తూ కనిపించాడు. రోహిత్ లేకపోతే ఫాస్ట్‌బౌలర్ జస్ప్రీత్ బుమ్రాకే కెప్టెన్సీ పగ్గాలు అందించే అవకాశాలున్నాయి.

ఆస్ట్రేలియా టూర్‌లో రిషబ్ పంత్ పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. దాంతో టీమ్ మేనేజ్‌మెంట్ ఆందోళన మరింత పెరిగింది. జట్టు వికెట్లు కోల్పోయి.. కష్టాల్లో ఉన్న సమయంలో ఆచితూడి ఆడుతూ జట్టును గట్టెక్కించాల్సింది పోయింది.. బాధ్యతా రహితమైన షాట్లు ఆడుతూ వికెట్ కోల్పోవడంపై అటు మాజీలతో పాటు.. అభిమానులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత టెస్టులో రిషబ్ పంత్ షాట్ ఎంపికపై తీవ్రంగానే విమర్శించారు. ప్రస్తుత పర్యటనలో పంత్ 22 సగటుతో ఏడు ఇన్నింగ్స్‌ల్లో 154 పరుగులు చేశాడు. ఇందులో ఒక అర్ధ సెంచరీ ఉంది. అయితే, టీమ్ మేనేజ్‌మెంట్ పంత్‌ని పక్కనే పెట్టే విషయంలో తొందరపడి నిర్ణయం తీసుకునే అవకాశం లేదు. అయితే, పంత్‌ను పక్కన పెడితే.. ధ్రువ్ జురెల్ వికెట్ కీపర్‌గా బాధ్యతలు తీసుకునే ఛాన్స్ ఉంది.

### ఆకాశ్ దీప్ దూరం

సిడ్నీ టెస్టులకు ఫాస్ట్ బౌలర్ ఆకాశ్ దీప్ దూరమయ్యాడు. ఐదో టెస్టుకు ఆకాశ్ దీప్ అందుబాటులో ఉండడం లేదని హెడ్‌కోచ్ గంభీర్ ధ్రువీకరించాడు. ఈ క్రమంలో బుమ్రా, మహ్మద్ సిరాజ్‌పై బౌలింగ్ భారపడనున్నది. దాంతో ఆకాశ్ స్థానంలో ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణాల మధ్య పోటీ నెలకొంది. ప్రసిద్ధ్ కృష్ణ కంటే హర్షిత్ రాణాకే తుదిజట్టులో చోటు కల్పించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

**సిడ్నీ టెస్టుకు భారత జట్టు (అంచనా) :** కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ/శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్.

**ఆస్ట్రేలియా తుది జట్టు :** సామ్ కాన్‌స్టాస్, ఉస్మాన్ ఖవాజా, మార్నస్ లాబుస్‌చగ్నే, స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్, బ్యూ వెబ్‌స్టర్, అలెక్స్ కారీ (వికెట్ కీపర్), పాట్ కమిన్స్ (కెప్టెన్), మిచెల్ స్టార్క్, నాథన్ లియోన్, స్కాట్ బోలాండ్.



# నలుగురికి ఖేల్‌రత్న అవార్డులు

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

భారత అత్యున్నత క్రీడా పురస్కారం మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డులను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ విజేత గుకేష్‌కు, షూటింగ్‌లో ఒలింపిక్స్ పతక విజేత మనుబాకర్‌కు, హాకీ క్రీడాకారుడు హర్మన్‌ప్రీత్‌సింగ్‌కు, పారా ఒలింపిక్స్ స్వర్ణ పతకం విజేత ప్రవీణ్ కుమార్‌కు ఖేల్‌రత్న అవార్డులు వరించింది. 17 మంది పారా అథ్లెట్లు సహా 32 మందికి అర్జున అవార్డులు, ఐదుగురికి ద్రోణాచార్య అవార్డులు దక్కాయి. ఈ నెల 17న ఖేల్‌రత్న అవార్డులను రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా ఈ నలుగురు కేంద్రానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# డ్రెస్సింగ్ రూమ్‌లో చర్చ బయటకు రావద్దు

- భారత క్రికెట్ జట్టు కోచ్ గంభీర్



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో భారత జట్టు ప్రదర్శన విషయంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. డ్రెస్సింగ్ రూమ్‌లో వాతావరణం వేడెక్కిందని సెలక్షన్ కమిటీ, కెప్టెన్ రోహిత్ శర్మతో గంభీర్‌కు విభేదాలు వచ్చాయని సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. ఈ విషయాలపై తాజాగా టీమ్‌ఇండియా కోచ్ గంభీర్ స్పందించారు. ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుకు ముందు జరిగిన ఓ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. క్రికెటర్లు, కోచ్‌కు మధ్య చర్చ డ్రెస్సింగ్ రూమ్ వరకే పరిమితం కావాలని, అవి బయటకు రాకూదని చెప్పారు "డ్రెస్సింగ్ రూమ్‌పై మీరు వింటున్న రూమర్స్ అన్నీ కేవలం వార్తలు మాత్రమే వాస్తవాలు కాదు! అక్కడ మేం మాట్లాడుకునేది ఒకే ఒక్క విషయం గురించి. అది ఆటగాళ్ల పెర్ఫామెన్స్?. వాళ్ల ఆడే తీరుపై నిజాయతీగా అక్కడ చర్చిస్తాం. ఇది మాకు ఎంతో ముఖ్యమైనది. అయితే డ్రెస్సింగ్ రూమ్‌లో కోచ్, ప్లేయర్ల మధ్య జరిగే చర్చ అక్కడి వరకు మాత్రమే పరిమితం కావాలి. ఎప్పుడూ బయటకు రాకూడదు. అక్కడ నిజాయతీ కలిగిన వ్యక్తులు ఉన్నంత వరకు భారత క్రికెట్ ఎప్పటికీ భద్రంగా ఉంటుంది. జట్టుగా ఏయే విషయాలపై పనిచేయాలనేది ఇక్కడ ప్రతి వ్యక్తికి బాగా తెలుసు. టెస్ట్ మ్యాచ్‌లు ఎలా గెలవాలన్నదానిపైనే మేం ఎప్పుడో చర్చించుకున్నాం. సీనియర్ ప్లేయర్స్ విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మతోనూ వ్యక్తిగతంగా మాట్లాడలేదు" అని తెలిపారు.




# 'గేమ్ ఛేంజర్' ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్‌నటించిన పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ గేమ్ ఛేంజర్. స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కించిన ఈ మూవీ సంక్రాంతి కానుకగా ఈ నెల10న థియేటర్లలో విడుదల కానుంది. తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను ప్రముఖ దర్శకుడు ఎస్–ఎస్ రాజమౌళి విడుదల చేశారు. రిలీజైన గేమ్ ఛేంజర్ ట్రైలర్ చూస్తే ఫుల్ యాక్షన్ అండ్ పొలిటికల్ స్టోరీగానే తెరకెక్కించినట్లు తెలుస్తోంది. 'నువ్వు ఐదు సంవత్సరాలు మాత్రమే మినిస్టర్.. నేను చనిపోయే వరకు ఐఏఎస్' ?అనే డైలాగ్ గ్లోబల్ స్టార్ ఫ్యాన్స్‌కు గూస్ బంప్స్ తెప్పిస్తోంది. దాదాపు 2 నిమిషాల 40 సెకన్ల పాటు ఉన్న గేమ్ ఛేంజర్ ట్రైలర్‌లో ఫైట్స్, విజువల్స్‌లో డైరెక్టర్ శంకర్ మార్క్ కనిపిస్తోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ భామ కియారా అద్వానీ హీరోయిన్‌గా నటించింది. కోలీవుడ్ హీరో ఎస్‌జే సూర్య కీలక పాత్రలో కనిపించనున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. తమిళ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ ఈ మూవీకి కథను అందించగా.. సముద్రఖని, ఎస్‌జే సూర్య, శ్రీకాంత్, సునీల్, నవీన్ చంద్ర, అంజలి తదితరులు నటించారు.



## ప్రత్యేకంగా 'సంక్రాంతికి వస్తున్నాం'

- వెంకటేశ్

**బలగం టీవీ, హైదరాబాద్**

అనిల్ రావిపూడి దర్శకత్వంలో విక్టరీ వెంకటేశ్ నటించిన సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం'. ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈ నెల 14న రిలీజ్ కానుంది. తాజాగా హీరో వెంకటేశ్‌ను మూవీటీమ్ స్పెషల్ ఇంటర్వ్యూ చేసింది. ఈ ఇంటర్వ్యూలో ఐశ్వర్య రాజేశ్ (చంటి), మీనాక్షి చౌదరి (బొబ్బిలి రాజా), దర్శకుడు అనిల్ రావిపూడి (జయం మనదేరాలో మహదేవనాయుడు), నిర్మాత దిల్ రాజు (ఘర్షణలో రామచంద్ర) వెంకటేశ్ సినిమాల్లోని ఐకాన్ పాత్రల గెటప్స్‌లో సందడి చేశారు.

ఈ సినిమా గురించి వెంకటేశ్ మాట్లాడుతూ మూవీ ఆడియెన్స్‌కు కచ్చితంగా నచ్చుతుందని, దీనిపై ఫుల్ కాన్ఫిడెంట్‌గా ఉన్నట్లు ఆయన తెలిపారు. 'గతంలో నేను ఎన్నో కామెడీ జానర్ చిత్రాల్లో యాక్ట్ చేశా. కానీ ఇది చాలా ప్రత్యేకంగా ఉండనుంది. ప్రేక్షకులు తప్పకుండా ఎంజాయ్ చేస్తారు' అని అన్నారు. పొంగల్ బరిలో ఉన్న అన్ని సినిమాలు విజయాన్ని అందుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సినిమాకు బీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. శ్రీ వేంకటేశ్వర క్రియోషన్స్? బ్యానర్‌పై దిల్‌రాజు ఈ సినిమా నిర్మిస్తున్నారు.

# 'దబిడి దిబిడి' పాట వచ్చేసింది



**బలగం టీవీ, హైదరాబాద్**

బాబీ దర్శకత్వంలో నందమూరి బాలకృష్ణ హీరోగా తెరకెక్కిన 'డాకు మహారాజ్'లోని 'దబిడి దిబిడి' అంటూ సాగే పాటను మేకర్స్ విడుదల చేశారు. ఈ మూడో సాంగ్ కూడా అదిరిపోయేలా ఉంది. ఈ పాటపై బాలయ్యకు జోడీగా ఊర్వశి రౌతేలా కనిపించింది. సాంగ్ లో ఇద్దరూ కలిసి ఎనర్జిటిక్ స్టెప్పులు వేయడం కనిపించింది. మామూలుగా బాలయ్య పాటల్లో వేసే స్టెప్పులకు సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. తాజాగా విడుదలయిన లిరికల్ సాంగ్‌లో కూడా అలాంటి స్టెప్పులు ఉన్నాయి. తమన్ సంగీతం అందించిన ఈ మూవీ ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మూవీని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ , సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు.